క్లుప్తంగా

సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ధన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేకు మండల ప్రజలు సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సాయి ప్రకాష్ కోరారు. మంగళవారం విలేకరులతో మట్లాడుతూ నేటినుంచి సర్వే ప్రారంభమవతుందని, అందుకు సంబధించిన ఏర్పాట్లను గ్రామాల వారిగా పూర్తి చేసినట్లు తెలిపారు. 73మంది ఎన్యూమరేటర్లు మరియు 7మంది సూపర్‌వైజర్లు నియమించినట్లు తెలిపారు.

'ముదిరాజ్‌లుగా నమోదుచేయాలి'



దామరగిద్ద: ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో ముదిరాజ్‌లు తమపేరుకు ముందు ముదిరాజ్ అని నమోదు చేయించాలని రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆంజనేయులు ముదిరాజ్, ఈదప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముదిరాజ్ నాయకుల మండల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మొగులప్ప, నీలి వెంకట్రాములు, శ్రీనివాస్, ఎంపీటీసీ అంజిలప్ప, అశోక్, తిరుపతి, చంద్రప్ప, రాములు పాల్గొన్నారు.

చిరుత పులుల బెడద నుంచి రక్షించండి

నారాయణపేట: జిల్లాలోని మద్దూరు, దామరగిద్ద, పేటమండలంతోపాటు జిల్లాలో అటవీ ప్రాంతం సరిహద్దు గ్రామాల్లో తరుచు చిరుత పులులు పశువుల మీద దాడి చేస్తూ రైతులకు అపార నష్టం కల్గిస్తున్నాయని వాటిబారి నుంచి రక్షించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాత్రి వేళలో పొలాలవద్ద రైతులు వారి పంటలను అడవి జంతువుల బారినుంచి కాపాడుకునేందుకు కాపలాగా ఉన్న దాడి చేసి గాయపారుచిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. అధికారులు స్పందించి చిరుతలను కట్టడి చేయాలని కోరారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం



మాగనూర్: మండంలోని తళంకేరి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు నర్సింహారెడ్డిని మంగళవారం గ్రామస్తులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బలరాం, గురువలింగంపల్లి హెచ్‌ఎం వినోద్‌కుమార్, సీఆర్‌పీ ఎల్లగౌడ్, కృష్ణయ్య, తిరుపతి, గ్రామస్తులు రాధిక, బాలప్ప, పెద్ద బాలప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మట్టిరోడ్లు నిర్మించుకోవాలి



మాగనూర్: ఉపాధిహామీ పథకం ద్వారా మట్టి రోడ్లు నిర్మించుకోవాలని ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నేరడగంలో ఉపాధిహామీ పనులపై నిర్వహించిన రెండోవ గ్రామసభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. పాటు కాల్వలు, మట్టిరోడ్లు తదితర పనులపై రైతులకు, గ్రామస్తులకు వివరించారు. అనంతరం పలు విషయాలపై సభలో తీర్మానం చేశారు. ఇన్‌చార్జి ఎంపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అర్జున్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మక్తల్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ పున:నిర్మాణం కోసం మక్తల్‌కు చెందిన శ్రీనివాస్‌గుప్తా రూ. లక్ష రూపాయల విరాళాన్ని ఆలయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్‌కు అందజేశారు. దీంతో ఆలయ మిటీ సభ్యులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో కట్టసురేష్, సలహాదారుడు తిరుపతి, నర్సింహులు, కట్ట వెంకటేష్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

- ఐకేపీ కేంద్రాలు– 9
- పీఏసీఎస్ కేంద్రాలు–4
- ప్రారంభం కాని మరో మూడు ఐకేపీ కేంద్రాలు
- రైతులకు ఏఈఓలచే టోకెన్‌ల జారీ



దామరగిద్ద ఐకేపీ కొనుగోలు కేంద్రానికి వచ్చిన గన్నీ బ్యాగులు

దామరగిద్ద: ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం మండలంలోని 13 కేంద్రాలను ముందస్తుగానే సిద్ధం చేసింది. మండలంలో వరిసాగు చేసిన రైతుల పంటలు ఇప్పుడిప్పుడే కోతలకు రావడంతో సకాలంలో కేంద్రాలు ప్రారంభం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరుకాగా వీటిలో ఐకేపీ ద్వారా 12కేంద్రాలు, పీఏసీఎస్ నుంచి 4కేంద్రాలు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు పీఏసీఎస్ ద్వారా దామరగిద్ద, క్యాతన్‌పల్లి, వత్తుగుండ్ల కంసాన్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ ద్వారా ప్రారంభించిన 9కేంద్రాల్లో 7కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి ఐదు వేల చొప్పున గన్నీ బ్యాగులను సరఫరా చేసి కేంద్రాలను సిద్ధం చేశారు. ఆయా కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించే మిల్లులను కేటాయించలేదని ఆయా కేంద్రాల నిర్వహకులు తెలియజేస్తున్నారు. ఐకేపీ ద్వారా ప్రారంభించిన లోకూర్తి, ఆశన్‌పల్లి కేంద్రాలకు గన్నీ బ్యాగులు అందాల్సి ఉంది.

టోకన్‌లు ఉంటేనే కొనుగోళ్లు..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే వ్యవసాయ అధికారులు రైతులు పండించిన ధాన్యం ఆరబెట్టిన అనంతరం మ్యాచర్‌ను గుర్తించి టోకెన్‌లు అందించాల్సి ఉంటుంది. టోకెన్‌లు పొందిన రైతులు ధాన్యాన్ని కేంద్రాల్లో విక్రయించేందుకు అనుమతిస్తారు. ఈ విషయమై వ్యవసాయ అధికారిని వివరణ కోరగా అవసమైన రైతులు ఏఈఓలను సంప్రదిస్తే టోకెన్‌లు అందజేస్తారని తెలియజేస్తున్నారు.

పెరుగనున్న ధాన్యం విక్రయాలు

ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా సన్నరకం వరిధాన్యానికి మద్దతు ధర రూ. 2320తోపాటు రూ. 500బోనస్ ప్రకటించిన నేపథ్యంలో ధాన్యం విక్రయాలు పెరిగే అవకాశం లేకపోలేదు. అన్నికేంద్రాలు ముందస్తుగానే ప్రారంభించి కొనుగోళ్లను సజావుగా కొనసాగిస్తేనే రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని అంటున్నారు.

సంతోషంగా ఉంది..



ధాన్యం కొనుగోళ్లను చేపట్టేందుకు ముందస్తుగానే కేంద్రాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. ఈ సారి వానలు ఆలస్యంగా కురిసినాట్లు ఆలస్యం చేయడంతో వెనకముందు పంటలు కోతకు వస్తున్నాయి. నాకున్న నాలుగు ఎకరాలు కోతకు వచ్చింది. కేంద్రం ప్రారంభం కావడంతో ధాన్యం విక్రయానికి బెంగ తీరింది.

– శంకర్‌రెడ్డి, రైతు కందెన్‌పల్లి

కేంద్రాలు సిద్ధం చేశాం..



ఐకేపీ ద్వారా మండల 12కేంద్రాల నిర్వహణకు అనుమతించారు. ఇప్పటివరకు గడిమున్కన్‌పల్లి, పిడెంపల్లి, బాపన్‌పల్లి మినహా మిగిలిన 9కేంద్రాలు ప్రారంభించాం. ప్రారంభించిన వాటిలో లోకూర్తి, ఆశన్‌పల్లి మినహా 7కేంద్రాలకు గన్నీ బ్యాగులు అందజేశారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల ద్వారా టోకెన్‌లు తీసుకొస్తే ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

– నర్సింహులు ఏపీఎం, దామరగిద్ద

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం ఉద్యమాల ద్వారానే సాధ్యమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద జరిగిన జిల్లా ధర్మాగ్రహ దీక్ష కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా డీఏలు పెండింగ్‌లో ఉంటూ పీఆర్సీ ప్రకటించకపోవడంతో ఉపాధ్యాయ ఉద్యోగులకు తీవ్రమైన ఆర్థిక నష్టం జరిగిందని వాపోయారు. సమస్యల సాధనకు ఉద్యమబాట పట్టించాల్సిన ఉద్దేశంతో పాఠశాల స్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు ఉద్యమ కార్యచరణ ప్రకటించినట్లు తెలిపారు. 317బాధితులకు న్యాయం చేయాలని, పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గుంపు బాలరాజ్, నర్సప్ప, మల్లికార్జున్, నర్సింహ, కిషోర్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సీతారాములు, నర్సింగప్ప, జ్యోతి, విజయ, సౌభాగ్యలక్ష్మి, విశ్వనాథరెడ్డి, శ్రీనివాస్, రవీందర్, వెంకట్రాములు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణకేంద్రం ప్రారంభం



కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

మద్దూరు: మండలంలోని పల్లెర్లలో ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఒంటరి మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని మంగళవారం సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణ ప్రారంభించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ఈ వర్గాలకు చెందిన పేదమహిళలు టైలరింగ్‌లో శిక్షణా పొంది ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతోనే దీన్నిఏర్పాటు చేసినట్లు తెలిపారు. పదిమిషన్‌ల ద్వారా ప్రతిరోజు 30మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీనివాసులు, స్వాతి, శారదమ్మ, లక్ష్మీ, గ్రామస్తులు సంజీవ్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం



వాహనాలకు వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కోస్గి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం వేలం పాట నిర్వహించి వేలం దక్కించుకున్న వారికి వాహనాలను అప్పగించారు. సర్కిల్ పరిధిలో మూడు ద్విచక్ర వాహనాలు పట్టుబడగా వేలం నిర్వహించారు. మూడు వాహనాలకు రూ.37500 అప్‌సెట్ ప్రైస్ నిర్ణయించగా 5మంది వేలంలో పాల్గొన్నారు. అత్యధికంగా ధర పాడిన వారికి వాహనాలు అందజేశారు. వేలం ద్వారా మూడు వాహనాలకు రూ.53,600 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మహబూబ్‌నగర్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, సీఐ బాలకృష్ణ, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

పల్లె వెలుగు పట్నానికి..!



నారాయణపేట రూరల్: విద్యార్థులకు అవసరమైన పల్లెవెలుగు బస్సులు నడిపించడంలో విఫలమవుతున్న ఆర్టీసీ అధికారులు వాటిని ఆదాయం సంపాదించడమే లక్ష్యంగా హైదరాబాద్ రూట్‌లో నడిపిస్తున్నారు. అయితే ఎన్నో గ్రామాలకు బస్సులు నడవక చాలామంది చిన్నారులు బడులు మానేస్తున్న కనీస పట్టింపులేకుండా పోతుంది. మరోపక్క వినతులు ఇస్తున్నా వాటిపై దృష్టి సారించడంలేదని విమర్శలు వస్తున్నాయి. పిల్లల భవిష్యత్‌పై ఆలోచనలు మాని ఆయా పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులను తగిలించి పట్నానికి పంపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొని పల్లెవెలుగు బస్సులను విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటుచేయాలని విద్యార్థి సంఘం నాయకులు, ట్రస్మా బాధ్యులు కోరుతున్నారు.

నేటినుంచి మహాలింగేశ్వరస్వామి జాతర



మహాలింగేశ్వరస్వామి దేవాలయం



స్వామివారి మూల విరాట్

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో వెలసిన శ్రీ మహాలింగేశ్వర స్వామి జాతర బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటిరోజు ఉదయం 9గంటలకు పల్లకిసేవ, సాయంత్రం 6గంటలకు జ్యోతి, రాత్రి భజన, రెట్టాపట్లు ఉంటాయన్నారు. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, సర్వదర్శనం అనంతరం భక్తులకు అన్నదానం ఉంటాయన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు..

మాగనూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను మంగళవారం ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, అదేవిధంగా ద్విచక్రవాహనదారులు విదిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

సాగునీరు అందించాలి



మక్తల్: పేట–మక్తల్–కొడంగల్ ఎత్తిపోతల పనులు వెంటనే ప్రారంభించి, వ్యవసాయ రంగానికి సాగునీరందించాలని జిల్లా సీపీఎం కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యవర్గ సభ్యులతో ఆయన మాట్లాడుతూ.. మక్తల్‌లో 3, 4 వతేదీల్లో నిర్వహించిన రెండో మహాసభలు విజయవంతం చేశారని అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికోసం ప్రభుత్వం ముందు ఉంచేందుకు మహాసభల్లో 12తీర్మానాలు చేసినట్లు తెలిపారు. మక్తల్ నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా గుర్తించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులు గోపాల్, పుంజునూరు ఆంజనేయులు, బాల్‌రాం, గోవింద్‌రాజు, కాశప్ప, బాల్‌రాంను ఎనుకున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



మద్దూరు: ఉమ్మడి మండలంలోని నిడ్జింతి, గొల్లోనిబాయి, బూనీడు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఏర్పాటు చేశారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం నారాయణ సూచించారు. ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2320, బీగ్రేడ్ రకం రూ.2300 చెల్లించనున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ బీమ్లు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, రఘుపతిరెడ్డి, తిర్పతిరెడ్డి, రమేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత్రికేయుల సేవలు మహోన్నతమైనవి



నారాయణపేట రూరల్: సమాజంలో పాత్రికేయుల పాత్ర మహోన్నత మైనవని ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. ఐజేయూ అనుబంధ సంస్థ టీయూ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నారాయణరెడ్డిని మంగళవారం బాలకేంద్రంలో పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వసంత్‌కుమార్, నర్సింహులు, చంద్రశేఖర్, మనోహర్‌గౌడ్, రఘు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేపపిల్లల విడుదల



మన్నాపూర్ చెరువులో చేపలు వదులుతున్న కాంగ్రెస్ నాయకులు

మద్దూరు: ముదిరాజ్‌ల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం పనిచేస్తుందని మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని మన్నాపూర్ చెరువుల్లో ఐదువేల చేపపిల్లలను, మద్దూర్ చెరువులో 35వేల చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు, కాడ అధికారి వెంకట్‌రెడ్డి మండల ప్రజాప్రతినిధుల సమక్షంలో వదిలారు. ఈమేరకు.. ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే నేపథ్యంలో నేటి నుంచి సామాజిక, ఆర్థిక, రాజకీయ ఉపాధి కులగణన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా ఎవ్వరి రిజర్వేషన్‌లు వారికి దక్కుతాయని, సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఏఎంసీ చైర్మన్ బీమ్లు, కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, తిర్పతిరెడ్డి, హన్మిరెడ్డి, మహేందర్‌రెడ్డి, చెన్నప్ప, సంజీవ్ పాల్గొన్నారు.

చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవాలి



మాట్లాడుతున్న బాలల పరిరక్షణ విభాగం అధికారిణి కరిష్మా

నారాయణపేట రూరల్ : పిల్లలను దత్తత తీసుకునే సమయంలో చట్టంలోని నిబంధనలు పాటించాలని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖకు చెందిన బాలల పరిరక్షణ విభాగం అధికారిణి కరిష్మా అన్నారు. మంగళవారం మండలంలోని కోటకొండ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్లు, ఆశాకార్యకర్తలకు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకుంటే మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. లక్ష వరకు జరిమానా ఉంటుందన్నారు. పిల్లలను అక్రమంగా అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని అందుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా ఉంటుందన్నారు. పిల్లలను దత్తత తీసుకునే వారు చట్ట ప్రకారం దరఖాస్తు చేసుకొవలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న, సహాయం కావాల్సిన వారికి బాల రక్ష భవన్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాల రక్షాబంధన్ సిబ్బంది, వైద్యులు, ఆశలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

దామరగిద్ద: మహిళలు ఆర్థికంగా సామాజికంగా రాణించాలని ఓఎంఐఎఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ హాజమ్మ, దళితసేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవిందర్‌నాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని వత్తుగుండ్లలో ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణను వారు ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభించామన్నారు. గజలప్ప, మార్కెట్ కమిటీ సభ్యులు వెంకటప్ప, అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, హన్మంతు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట: ప్రజలు ఏటీఎంలో డబ్బులు డ్రా చేసే సమయంలో కొత్త వ్యక్తులకు ఏటీఎం కార్డ్స్ ఇవ్వొద్దని, జాగ్రత్తగా ఉండాలని సీఐ శివశంకర్ సూచించారు. మంగళవారం పేటపోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ఆయా బ్యాంక్ పరిసరాల్లో ఉన్న వారిని ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ మేరకు.. ప్రస్తుత కాలంలో బ్యాంకుల వద్ద దొంగలు అధిక మొత్తంలో లావాదేవీలు జరిపే వారిపై మాటువేసి ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకుపోయే సమయంలో వెంటపడి మార్గమధ్యలో దొంగతనాలు చేసి తప్పించుకుని వెళ్లడం జరుగుతుందన్నారు. బ్యాంకుల వద్ద నంబర్ ప్లేట్‌లేని వాహనాలను ఉంటే వాటిని సీజ్ చేస్తామన్నారు. బ్యాంకుల వద్ద వచ్చే కస్టమర్లు జాగ్రత్తలు పాటించాలని కోరారు. సీఐతోపాటు ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలతో అరాచకం



మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: మతోన్మాద నినాదంతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిచ్చుపెడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టి దేశంలో సెక్యులరిజానికి తూట్లు పొడుస్తుందని ఆరోపించారు. మండల కేంద్రంలోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సీపీఐ మున్సిపల్ పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై విమర్శలు చేశారు. ఈసందర్భంగా విజయరాములు మాట్లాడుతూ హిందూ జపం ముసుగులో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పేదల కష్టాలను తీర్చడంలో విఫలమైందన్నారు. దేశంలో అన్ని జాతీయ పార్టీల కంటే సీపీఐ పార్టీకే వందేళ్ల చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ కంటే ముందే సమైక్యవాదం, సామ్యవాదం, స్వాతంత్ర్యం అనే నినాదంతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఏకైక జాతీయ పార్టీ సీపీఐ అన్నారు. దేశంలో 85 శాతం పైగా రైతులు ఉండగా వారికి వ్యతిరేకంగా నల్ల వ్యవసాయ చట్టాలను అమలులోకి తీసుకోని రావడం ఎంత వరకు సమంజసం అన్నారు. అమరచింత మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు భాస్కర్, అబ్రహం, శ్యాంసుందర్, కుతుబ్, గీత, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

అమరచింత: బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న పీఎఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ హైదరాబాద్‌లోని పీఎఫ్ కార్యాలయంలో రీజినల్ కమిషనర్–2 వినాయకన్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించామని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సామేలు, రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా బీడీ కార్మికులు పీఎఫ్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మాగనూర్: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ప్రమాదాలకు నిలయంగా మారింది. మంగళవారం ఉదయం 5గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనదారుడు అదపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా.. భాస్కర్‌గౌడ్ కర్ణాటక రాష్ట్రంలోని శక్తినగర్ వద్ద ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. రోజు మాదిరిగానే మక్తల్ నుంచి శక్తినగర్‌కు వెళ్తున్న క్రమంలో రోడ్డుపై ధాన్యం అడ్డుగా ఉండటంతో కనిపించక వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతడు తీవ్రంగా గాయడటంతో డయాల్ –100 సిబ్బంది అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు.

చిరుత దాడిలో మేకలు మృతి



గనిమోనిబండలో చనిపోయిన మేకలు

నారాయణపేట రూరల్ : చిరుత దాడిలో రెండు మేకలు మరణించినట్లు మండలంలోని గనిమోనిబండ గ్రామానికి చెందిన కాపరి వెంకటప్ప తెలిపారు. సోమవారం మేకలను తీసుకొని అడవికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో చిరుత దాడి చేయగా మేకలు చెల్లాచెదురుగా వెళ్లిపోయాయి. చీకటిపడటంతో కొన్ని మేకలు ఇంటికొచ్చాయి. మిగితా వాటి కోసం మంగళవారం వెతకగా రెండు మేకలు చిరుత దాడిలో చనిపోయినట్లు గుర్తించారు. దాదాపు రూ.18వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం అందించాలని ఆయన కోరారు. చిరుతను అటవీ అధికారులు పట్టుకుని జూకు తరలించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ షాక్‌తో కోడెదూడ...

పట్టణంలోని బహార్‌పేటకు చెందిన నందు గొల్ల పెంటప్ప పశుగ్రాసం కోసం సమీపంలోని పొలానికి కోడెదూడను తీసుకువెళ్లారు. ప్రమాదవశాత్తు పొలం దగ్గర కర్రపై వేలాడుతున్న విద్యుత్ వైరు తగిలి ఒక కోడె దూడ ఎగిరిపడింది. వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు.